## క్లుప్తంగా

### విద్యుత్ ఉండని ప్రాంతాలు

మైలార్‌దేవ్‌పల్లి: మైలార్‌దేవ్‌పల్లి విద్యుత్ సబ్ స్టేషన్ పరిధిలో మంగళవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని రాజేంద్రనగర్ విద్యుత్ అసిస్టెంట్ డివిజనల్ ఇంజినీర్ మధు ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు విద్యుత్ కోత ఉంటుందన్నారు. ప్రగతి నగర్, బృందావన్ కాలనీ, మైలార్‌దేవ్‌పల్లి, వినాయక్ నగర్, ఆలీనగర్, మొఘల్స్ కాలనీ, పల్లెచెరువు, బండ్లగూడ, ఆశమాబాద్, మిలన్ కాలనీ, క్రిస్టల్ టౌన్, సుభాష్ కాలనీ ఫేజ్–1,2, రాజీవ్‌గాంధీ నగర్, శాంతినగర్, గణేష్‌నగర్, నాగమల్లయ్య వేబ్రిడ్జి, దుర్గానగర్, స్వప్న థియేటర్, బి.కె.పురం, రిజ్వాన్ కాలనీ, శమాకాలనీ, జైన్ కాలనీ, శాస్త్రీపురం తదితర ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదని, వినియోగదారులు సహకరించాలని కోరారు.

### క్రికెట్ టోర్నమెంట్‌కు రావాలని ఎమ్మెల్యేకు ఆహ్వానం



ఎమ్మెల్యేకు ఆహ్వానపత్రం అందజేస్తున్న టోర్నమెంట్ నిర్వాహకులు

మణికొండ: నార్సింగి మున్సిపాలిటీ పరిధిలోని మంచిరేవుల గ్రామంలో ఈ నెల 26న నిర్వహిస్తున్న మంచిరేవుల క్రికెట్ లీగ్ పోటీలను ప్రారంభించేందుకు రావాలని ఎమ్మెల్యే టి.ప్రకాశ్‌గౌడ్‌ను నిర్వాహకులు ఆహ్వానించారు. సోమవారం ఆయనను కలిసి గ్రామంలోని ప్రజాభవన్ ఆవరణలో 4 ఓవర్ల ఇన్నింగ్గా పోటీలు నిర్వహిస్తున్నట్లు వివరించారు. గెలుపొందిన జట్లకు నగదు బహుమతులతో పాటు ట్రోఫీలు అందజేయనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఎమ్మెల్యేను కలిసిన వారిలో వేణుగోపాలస్వామి దేవాలయ అభివృద్ధి కమిటీ చైర్మన్ పొన్న రమేష్, టోర్నమెంట్ నిర్వాహకులు క్రాంతికుమార్, జి.రాకేష్, బి.చంటి ఉన్నారు.

### వాసవీమాతకు కుంకుమార్చన



కుంకుమార్చనలో పాల్గొన్న భక్తులు

మణికొండ: వాసవీకన్యకాపరమేశ్వరి ఆత్మార్పణ దినోత్సవాన్ని పురస్కరించుకుని మణికొండ వాసవీ అసోసియేషన్స్ ఆధ్వర్యంలో భక్తులు సామూహిక కుంకుమార్చనలు నిర్వహించారు. పుప్పాలగూడ కాశీ విశ్వేశ్వరాలయం ఆవరణలో అమ్మవారికి అభిషేకం నిర్వహించి అనంతరం కుంకుమార్చనలు చేశారు. కార్యక్రమంలో అసోసియేషన్ నాయకులు, సభ్యులు పాల్గొన్నారు.

### ఎంఎస్ మిషన్ హైస్కూల్ వార్షికోత్సవం



రాజేంద్రనగర్: విద్యార్థులు చదువులో రాణించేందుకు క్రమ శిక్షణ, పట్టుదల ఎంతో ముఖ్యమని నాంపల్లి ఎమ్మెల్యే జాఫర్ హుస్సేన్ మెహరాజ్ అన్నారు. ఎం.ఎస్.మిషన్ హైస్కూల్ 15వ వార్షికోత్సవ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా ఆయన పాల్గొన్నారు. చదువుకుంటేనే బంగారు భవిష్యత్తు ఉంటుందని ఆయన విద్యార్థులకు సూచించారు.

### వ్యాయామంతో సంపూర్ణ ఆరోగ్యం



ఓపెన్ జిమ్‌లో వ్యాయామం చేస్తున్న ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్, కౌన్సిలర్ సంజయ్‌యాదవ్

శంషాబాద్: వ్యాయామంతో సంపూర్ణ ఆరోగ్యం సొంతమవుతుందని ఎమ్మెల్యే టి.ప్రకాష్‌గౌడ్ అన్నారు. పట్టణంలోని 19వ వార్డులో ఏర్పాటు చేసిన ఓపెన్ జిమ్‌ను మున్సిపల్ చైర్‌పర్సన్ సుష్మతో కలిసి ఆయన ప్రారంభించారు. ఓపెన్ జిమ్‌ల ఏర్పాటుతో అన్ని వార్డుల్లో ప్రజలకు వ్యాయామ పరికరాలు అందుబాటులోకి వచ్చాయని ఆయన అన్నారు. ప్రజలు వీటిని సద్వినియోగం చేసుకుని ఆరోగ్యంగా ఉండాలని ఎమ్మెల్యే సూచించారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్‌చైర్మన్ బండి గోపాల్‌యాదవ్, కౌన్సిలర్ పి.సంజయ్‌యాదవ్, అజయ్, మస్రత్, నాజియా తదితరులు పాల్గొన్నారు.

# అక్రమ కట్టడాలపై చర్యలేవి..?

- ఇందిరా గాంధీ హౌసింగ్ సొసైటీలో పెద్ద ఎత్తున అక్రమ నిర్మాణాలు
- ప్రజాప్రతినిధుల అండతోనే గోదాంలు నిర్మిస్తున్నారనే ఆరోపణలు
- అనుమతి లేని కట్టడాలపై చర్యలు తీసుకోవాలని ప్రజల విజ్ఞప్తి




సొసైటీ బోర్డుపై అంటించిన పోస్టర్లు

మైలార్‌దేవ్‌పల్లి: ఇందిరా గాంధీ హౌసింగ్ సొసైటీలో పెద్ద ఎత్తున అక్రమ గోదాంలు వెలుస్తున్నాయి. ప్రజాప్రతినిధుల అండతోనే బేగంబజార్ వ్యాపారులు సొసైటీలో అక్రమ నిర్మాణాలు చేపడుతున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. మాజీ పార్లమెంట్ సభ్యుడు వి.తులసీరామ్ గగన్‌పహాడ్‌లో స్థానికుల అవసరాల మేరకు సొసైటీ ఏర్పాటు చేశారు. అయితే ఎలాంటి అనుమతులు లేకుండా ఎవరికి వారు ఇష్టానుసారంగా కొనుగోలు చేసిన స్థలాల్లో వందలాది అక్రమ గోదాంలు వెలుస్తున్నాయి. స్థానికులతో ఒప్పందాలు కుదుర్చుకున్న బేగంబజార్ వ్యాపారులు కాంట్రాక్టు పద్ధతిలో గోదాంలు ఏర్పాటు చేసుకుంటున్నట్లు తెలుస్తోంది. సొసైటీ ఏర్పాటు చేసిన బోర్డుపై గిడ్డంగులు అద్దెకు ఇస్తామంటూ పోస్టర్లు అంటించడం చర్చనీయాంశంగా మారింది. అక్రమ నిర్మాణాలపై రాజేంద్రనగర్ టౌన్‌ప్లానింగ్ అధికారులు చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు. 2022 సంవత్సరంలో గోదాంల పరిసర ప్రాంతాల్లో చెత్తను సేకరించే ఓ మహిళ కెమికల్ బాంబు పేలి అక్కడికక్కడే మృతిచెందింది. నిర్మానుష్య ప్రాంతంగా ఉండే ఇందిరా గాంధీ హౌసింగ్ సొసైటీలో జరుగుతున్న అసాంఘిక కార్యకలాపాలపై పోలీసులు దృష్టి సారించాలని పలువురు కోరుతున్నారు.



ఇందిరా గాంధీ హౌసింగ్ సొసైటీలో అక్రమంగా నిర్మిస్తున్న గోదాంలు



వేడుకలకు హాజరైన ఎంపీ రంజిత్‌రెడ్డి, ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్,



వేడుకల్లో పాల్గొన్న మంత్రి నిరంజన్‌రెడ్డి

## వైభవంగా విగ్రహ ప్రతిష్ఠాపన వేడుకలు

మణికొండ: మణికొండ మున్సిపాలిటీ పరిధిలోని పంచవటి కాలనీలో నూతనంగా నిర్మించిన మహాగణపతి సుబ్రహ్మణ్యేశ్వర నవగ్రహ సహిత లలితాపరమేశ్వరీ సమేత కామేశ్వర స్వామి ఆలయంలో విగ్రహ ప్రతిష్ఠాపన పూజలు ఘనంగా కొనసాగుతున్నాయి. వేడుకల్లో భాగంగా రెండవ రోజు సోమవారం ఉదయం మండప పూజలు, వేద పారాయణం, మహారుద్రహోమం, సాయంత్రం మూల మంత్రానుష్టానములు, నవచండీ పారాయణ, దీక్షా హోమాలు నిర్వహించారు.

**హాజరైన ప్రజాప్రతినిధులు..**

విగ్రహ ప్రతిష్ఠాపన వేడుకల్లో సోమవారం రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి నిరంజన్‌రెడ్డి, ఎంపీ గడ్డం రంజిత్‌రెడ్డి, ఎమ్మెల్యే టి.ప్రకాశ్‌గౌడ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఆలయాలు మనకు ధర్మాన్ని నేర్పిస్తాయని, సమాజంలో ఉత్తమంగా జీవించాలంటే ప్రతిరోజూ దేవాలయాలను సందర్శించాలన్నారు. కార్యక్రమంలో ఆల్‌కాలనీస్ ఫెడరేషన్ అధ్యక్షుడు డి.సీతారాం, కాలనీ సంక్షేమ సంఘం నాయకులు లక్ష్మీనారాయణ, భీంరెడ్డి, రామసుబ్బారెడ్డి, రామారావు, రమణ, వైజీకే మూర్తి, పుల్లారావు, స్థానిక బీఆర్‌ఎస్ నాయకులు పాల్గొన్నారు.

**నేడు పీఠాధిపతి రాక..**

శివాలయ విగ్రహ ప్రతిష్ఠాపన వేడుకల్లో మంగళవారం పుష్పగిరి పీఠాధిపతి, మదభినవోద్దండ విద్యా శంకర భారతి స్వామి పాల్గొంటారని దేవాలయ కమిటీ నాయకులు తెలిపారు. ఉదయం 8 గంటలకు జరిగే పూజల్లో ఆయన పాల్గొని భక్తుల నుద్దేశించి మాట్లాడతారని చెప్పారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొనాలని వారు కోరారు.

## ప్రతి సమస్యనూ పరిష్కరిస్తాం



బృందావన్ కాలనీలో డ్రైనేజీ పనులను పరిశీలిస్తున్న కార్పొరేటర్ శ్రీనివాస్‌రెడ్డి

మైలార్‌దేవ్‌పల్లి: మైలార్‌దేవ్‌పల్లి డివిజన్‌లో నెలకొన్న ప్రతి సమస్యను సాధ్యమైనంత త్వరగా పరిష్కరించేందుకు ప్రత్యేక చొరవ తీసుకుంటున్నామని కార్పొరేటర్ తోకల శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. మొఘల్స్ కాలనీ, బృందావన్ కాలనీల్లో సీసీ రోడ్లు, భూగర్భ డ్రైనేజీ పైపులైన్ పనులను అధికారులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కాలనీల్లో నెలకొన్న సమస్యలు తెలుసుకునేందుకు ప్రతిరోజూ పర్యటిస్తున్నామన్నారు. తమ దృష్టికి వచ్చిన సమస్యలను సాధ్యమైనంత త్వరగా పరిష్కరించేందుకు కృషి చేస్తున్నట్లు తెలిపారు. ప్రజలకు మెరుగైన సదుపాయాల కల్పనే ధ్యేయంగా పనిచేస్తున్నామని ఆయన అన్నారు. ప్రజలకు సమస్యలు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. టి.సుధాకర్‌రెడ్డి, రావుల భాస్కర్, డివిజన్ మైనార్టీ మోర్చా అధ్యక్షుడు మజార్, శ్రీకాంత్‌రెడ్డి, కిరణ్, పాండుయాదవ్, కొవ్వకుల బాబు, అక్కెం శివకుమార్, గఫర్‌షా, ఫజల్, మాజహర్, ఖలీం, ఇమ్రాన్, జీహెచ్‌ఎంసీ వర్క్ ఇన్‌స్పెక్టర్ రాహుల్, లోక్‌నాథ్, బస్తీవాసులు పాల్గొన్నారు.

## నకిలీ ఖాతాతో నగదు మాయం

శంషాబాద్ రూరల్: ఓ వ్యక్తి సెల్ నంబర్ ఆధారంగా బ్యాంకు ఖాతా తెరిచి అతడి మరో ఖాతా నుంచి డబ్బులు కాజేసిన ఘటనపై పోలీసులు కేసు నమోదు చేశారు. ఇన్‌స్పెక్టర్ ఏ.శ్రీధర్‌కుమార్ తెలిపిన వివరాల.. తొండుపల్లిలో నివాసముండే ఘన్‌శ్యాం కుమార్‌సింగ్ పేరుతో అతడి సెల్ నంబర్‌పై సైబర్ నేరగాళ్లు కూకట్‌పల్లి బ్రాంచ్ ఆర్‌బీఎల్ బ్యాంకులో ఖాతా తెరిచారు. కుమార్‌సింగ్‌కు చెందిన మరో ఖాతా నుంచి ఈ కేటుగాళ్లు రూ.4,990 డ్రా చేశారు. అతడి పేరుతో స్నేహితుడు త్రిలోక్‌నాథ్‌కు మేసేజ్ పంపించి అతడి వద్ద రూ.5వేలు తీసుకున్నారు. బాధితుడి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

## రాష్ట్రంలో బీజేపీకి అధికారం ఖాయం

మైలార్‌దేవ్‌పల్లి: రాబోయే సాధారణ ఎన్నికల్లో రాష్ట్రంలో భారతీయ జనతా పార్టీ జెండా ఎగరడం ఖాయమని బీజేపీ సీనియర్ నాయకురాలు కొమిరెడ్డి ఉమామహేశ్వరిరెడ్డి అన్నారు. ఈ మేరకు హైదర్‌గూడలోని బీజేపీ కార్యాలయంలో ఆమె మాట్లాడుతూ.. దేశ వ్యాప్తంగా నరేంద్రమోదీ చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలను చూసి తెలంగాణ ప్రజలు బీజేపీకి ఓటు వేసేందుకు సిద్ధంగా ఉన్నారన్నారు. ఉమ్మడి రంగారెడ్డి జిల్లాలో బీజేపీ బలంగా ఉందని, జిల్లాలోని అన్ని నియోజకవర్గాలను బీజేపీ కైవసం చేసుకోవడంతో పాటు రాజేంద్రనగర్‌లో భారీ మెజార్టీ సాధిస్తామని ధీమా వ్యక్తం చేశారు. కష్టపడి పనిచేసే వారికి పార్టీలో ప్రాధాన్యత ఉంటుందని ఆమె పేర్కొన్నారు.

## క్యాట్ ఒలింపియాడ్‌లో శ్రీ చైతన్య విద్యార్థుల ప్రతిభ



విద్యార్థులను అభినందిస్తున్న ప్రిన్సిపాల్ పుష్ప

రాజేంద్రనగర్: దేశ వ్యాప్తంగా నిర్వహించిన క్యాట్ ఒలింపియాడ్ సెకండ్ లెవల్ పరీక్షల్లో అత్తాపూర్ శ్రీ చైతన్య విద్యార్థులు సత్తా చాటారు. జాతీయ స్థాయి క్యాట్ ఒలింపియాడ్‌లో 15 మంది విద్యార్థులు మెరిట్ సర్టిఫికెట్, మెడల్స్ సాధించారు. ముగ్గురు విద్యార్థులు రూ.1000 చొప్పున క్యాష్ ప్రైజ్ గెలుచుకున్నారు. సోమవారం పాఠశాలలో ప్రతిభ కనబర్చిన విద్యార్థులను ప్రిన్సిపాల్ పుష్ప అభినందించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. విద్యార్థులు చదువుతో పాటు అన్ని రంగాల్లో పాలు పంచుకున్నప్పుడే విజ్ఞానం పెరుగుతుందన్నారు. క్రమ శిక్షణ, పట్టుదల ఉంటే అనుకున్న లక్ష్యాలను సులభంగా సాధించవచ్చన్నారు. కార్యక్రమంలో డీన్ విష్ణు, బ్యాచ్ ఇన్‌చార్జి రఘు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## గురుకుల పాఠశాలను సందర్శించిన కౌన్సిలర్



భోజనాన్ని పరిశీలిస్తున్న కౌన్సిలర్ ప్రవీణ్‌కుమార్, ప్రిన్సిపాల్

మణికొండ: సాంఘిక సంక్షేమ శాఖ నార్సింగి బాలికల గురుకుల పాఠశాలలో సౌకర్యాలు బాగున్నాయని మున్సిపాలిటీ 8వ వార్డు కౌన్సిలర్ పత్తి ప్రవీణ్‌కుమార్ అన్నారు. సోమవారం ఆయన గురుకులంలో పర్యటించి విద్యార్థులను అడిగి సమస్యలు తెలుసుకున్నారు. డ్రైనేజీని శుభ్రం చేయించడంతో పాటు పాఠశాల ఆవరణలో పారిశుద్ధ్య పనులు చేయించారు. అనంతరం భోజనాన్ని పరిశీలించారు. పాఠశాలలో సౌకర్యాలు బాగున్నా మాలమహానాడు జాతీయ అధ్యక్షుడినని చెప్పుకునే ఓ వ్యక్తి సౌకర్యాలు సరిగా లేవని, ప్రిన్సిపాల్‌ను బదిలీ చేయాలని చెప్పడం విడ్డూరంగా ఉందని ఆయన అన్నారు. వారానికోసారి పాఠశాలకు వెళ్లి సమస్యలు పరిష్కరిస్తానని పేర్కొన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ కృపావరం తదితరులు పాల్గొన్నారు.

## బాలికలు ధైర్యవంతులుగా ఉండాలి



జాతీయ బాలికల దినోత్సవంలో పాల్గొన్న చైర్‌పర్సన్ సుష్మ, విద్యార్థులు

శంషాబాద్: బాలికలు ధైర్యవంతులుగా ఉండాలని మున్సిపల్ చైర్‌పర్సన్ సుష్మ సూచించారు. ఐసీడీఎస్ ఆధ్వర్యంలో సోమవారం పట్టణంలోని జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో జాతీయ బాలికల దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ఆరోగ్యం పట్ల బాలికలు ప్రత్యేక శ్రద్ధ చూపాలన్నారు. బాలికలు భవిష్యత్తులో అన్ని రంగాల్లో సాధికారత సాధించే దిశగా ప్రభుత్వం శ్రద్ధ చూపుతోందన్నారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సీడీపీఓ షబానా, మున్సిపల్ వైస్‌చైర్మన్ బండి గోపాల్‌యాదవ్, కౌన్సిలర్లు రేఖ, అజయ్ తదితరులు పాల్గొన్నారు

## పేదల అభ్యున్నతికి ప్రభుత్వం కృషి



కమ్యూనిటీహాల్ పనులకు శంకుస్థాపన చేస్తున్న మేయర్ మహేందర్‌గౌడ్

బండ్లగూడ: పేదల అభ్యున్నతి కోసం రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తుందని బండ్లగూడ జాగీరు మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ మహేందర్‌గౌడ్ అన్నారు. కిస్మత్‌పూర్‌లో వృద్ధుల కోసం నిర్మిస్తున్న నూతన కమ్యూనిటీహాల్ పనులను సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్ చొరవతో మున్సిపల్ కార్పొరేషన్‌ను అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తున్నామన్నారు. వృద్ధుల కోసం అన్ని వసతులతో కమ్యూనిటీ హాల్ నిర్మిస్తున్నట్లు ఆయన తెలిపారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ కార్పొరేషన్ అధ్యక్షుడు సురేష్‌గౌడ్, సీనియర్ నాయకులు సంగారెడ్డి, విష్ణువర్ధన్‌రెడ్డి, కోఆప్షన్ సభ్యుడు జగదీష్, ఓల్డ్ ఏజ్ పెన్షన్ అసోసియేషన్ అధ్యక్షుడు నారాయణ, సభ్యులు రాంచందర్, రాంచందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## 'కంటి వెలుగు'కు విశేష స్పందన



కంటి వెలుగు శిబిరంలో ప్రజలతో మాట్లాడుతున్న కమిషనర్ వేణుగోపాల్‌రెడ్డి

బండ్లగూడ: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న కంటి వెలుగు కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని బండ్లగూడ జాగీరు మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ వేణుగోపాల్‌రెడ్డి సూచించారు. సోమవారం కార్పొరేషన్ పరిధిలోని 1వ డివిజన్‌లో 112 మందికి, 19వ డివిజన్‌లో 142 మందికి ఉచిత కంటి పరీక్షలు నిర్వహించారు. కంటి వెలుగు కేంద్రాలను పరిశీలించిన అనంతరం ఆయన మాట్లాడుతూ.. 2వ విడత కంటి వెలుగు కార్యక్రమానికి ప్రజల నుంచి విశేష స్పందన లభిస్తుందన్నారు. కంటి సమస్యలు ఉన్నవారికి పరీక్షలు చేసి ఉచితంగా మందులు, కళ్లద్దాలు అందజేయడంతో పాటు ఆపరేషన్లు చేయిస్తామని వెల్లడించారు. కార్యక్రమంలో శానిటేషన్ ఇన్‌స్పెక్టర్ నరేష్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రమాదంలో గాయపడిన వ్యక్తి చికిత్స పొందుతూ మృతి

మైలార్‌దేవ్‌పల్లి: రోడ్డు ప్రమాదంలో గాయపడిన యువకుడు చికిత్స పొందుతూ మృతిచెందిన ఘటన మైలార్‌దేవ్‌పల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. శాస్త్రీపురం ప్రాంతానికి చెందిన అబ్దుల్ రహీం(27) ఈ నెల 23న నలుగురు స్నేహితులతో కలిసి తాడ్‌బన్ నుంచి తన నివాసానికి కారులో వస్తుండగా శాస్త్రీపురం చౌరస్తాలో ట్రాఫిక్ సిగ్నల్ పోల్‌ను ఢీ కొట్టారు. ఈ ఘటనలో గాయాలపాలైన అబ్దుల్ రహీంను ఉస్మానియా ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతిచెందాడు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## మెరుగైన ఫలితాల సాధనకు కృషి



హనుమంతు

మైలార్‌దేవ్‌పల్లి: విద్యార్థులకు మెరుగైన విద్య అందిస్తూ మెరుగైన ఫలితాలు సాధించే దిశగా ఉపాధ్యాయులు కృషి చేయాలని మైలార్‌దేవ్‌పల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు హనుమంతు అన్నారు. గతంలో పని చేసిన ప్రధానోపాధ్యాయుడిపై విద్యార్థుల తల్లిదండ్రులు, విద్యార్థులు చేసిన ఆరోపణల మేరకు ఫిజికల్ డైరెక్టర్‌గా ఉన్న హనుమంతును ప్రధానోపాధ్యాయుడిగా నియమించారు. ఈ మేరకు సోమవారం ఆయన బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా హనుమంతు మాట్లాడుతూ.. ప్రైవేట్ పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులను అన్ని రంగాల్లో తీర్చిదిద్దేందుకు కృషి చేస్తున్నట్లు తెలిపారు. రాష్ట్రంలో ప్రభుత్వ పాఠశాలల్లో సౌకర్యాలు మెరుగుపర్చడంతో విద్యా ర్థులు విద్యతో పాటు క్రీడల్లోనూ రాణిస్తున్నారని ఆయన అన్నారు. ఉపాధ్యాయులు మల్లారెడ్డి, డి.సురేష్‌ముదిరాజ్, కేశవులు, నుస్రత్ ఆలీ, శ్రీధర్, రాములు, మల్లేష్ తదితరులు పాల్గొన్నారు.

## అలుపెరగని పోరాట యోధుడు నేతాజీ



హైదర్‌గూడలో నేతాజీ విగ్రహానికి నివాళులర్పిస్తున్న నాయకులు

రాజేంద్రనగర్: నేతాజీ సుభాష్ చంద్రబోస్‌ను యువత ఆదర్శంగా తీసుకొని ఆయన అడుగుజాడల్లో నడవాలని అత్తాపూర్ డివిజన్ కార్పొరేటర్ మోండ్ర సంగీతాగౌరీశంకర్ అన్నారు. హైదర్‌గూడలోని నేతాజీ విగ్రహం వద్ద 126వ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన కార్పొరేటర్ నేతాజీ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. భారత స్వాతంత్ర్య సమర యోధుల్లో అగ్రగణ్యుడు, పుట్టుకే కానీ మరణం లేని మహావీరుడు నేతాజీ అని కొనియాడారు. అలుపెరగని పోరాటంతో ఓటమి ఎరుగని వ్యక్తిత్వంతో ఆయన దేశానికి అనేక సేవలు అందించారన్నారు. అసమాన త్యాగాలతో ఆయన భావితరాలకు ఎప్పటికీ ప్రేరణగా నిలుస్తారన్నారు. మాతృభూమి సేవకు తన జీవితాన్ని అంకితం చేసిన మహానేత అని ఆమె కొనియాడారు. కార్యక్రమంలో కోలన్ సుభాష్‌రెడ్డి, ఎం.కొమురయ్య, మ్యాడం రామేశ్వర్‌రావు, సుధాకర్, సోమారం రవి, హరినాథ్, రాజ్‌కుమార్, నల్లింగ్ రాజేందర్, గౌతం, సులిగే ధనరాజ్, సాయినాథ్‌రెడ్డి, హరి, అజయ్, అఖిల్, రాజు తదితరులు పాల్గొన్నారు.



పిల్లోనిగూడలో నేతాజీ జయంతి వేడుకల్లో పాల్గొన్న సర్పంచ్ బుచ్చమ్మ తదితరులు

**పిల్లోనిగూడలో..**

శంషాబాద్ రూరల్: మండలంలోని పిల్లోనిగూడలో సోమవారం నేతాజీ సుభాష్ చంద్రబోస్ జయంతి వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి పలువురు నివాళులర్పించారు. కార్యక్రమంలో సర్పంచ్ బుచ్చమ్మ, ఉప సర్పంచ్ కృష్ణ, వార్డు సభ్యుడు సుధాకర్, బీఆర్‌ఎస్ పార్టీ నాయకులు కె.నర్సింహ, జుర్కి రమేష్, సుబ్బారావు, తదితరులు పాల్గొన్నారు.

## పుప్పాలగూడలో ఘనంగా బీరప్ప ఉత్సవాలు



బీరప్ప ఉత్సవాలకు హాజరైన ఎంపీ రంజిత్‌రెడ్డి, ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్ తదితరులు

మణికొండ: ఐదు సంవత్సరాలకు ఒకసారి నిర్వహించే బీరప్ప ఉత్సవాలు పుప్పాలగూడలో సోమవారం ఘనంగా నిర్వహించారు. ఉదయం 9 గంటలకు భక్తులు గంపలతో ఊరేగింపుగా దేవాలయానికి చేరుకుని అక్కడే బోనాలను సిద్ధం చేసుకున్నారు. మధ్యాహ్నం ఒగ్గు కళాకారులు బీరప్ప కల్యాణాన్ని వైభవంగా నిర్వహించారు. అనంతరం స్వామి వారికి బోనాలు సమర్పించారు. ఆలయ వద్ద ఏర్పాటు చేసిన ఒగ్గు కథను భక్తులు శ్రద్ధగా విన్నారు. ఐదు సంవత్సరాల తర్వాత గ్రామంలో బీరప్ప ఉత్సవాలు జరగడంతో గ్రామస్తులు వారి బంధుమిత్రులను ఆహ్వానించి పెద్ద ఎత్తున వేడుకలు నిర్వహించి మొక్కులు చెల్లించుకున్నారు. స్థానిక ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్, ఎంపీ గడ్డం రంజిత్‌రెడ్డి, మున్సిపల్ చైర్మన్ కె.నరేందర్‌ముదిరాజ్, బీఆర్‌ఎస్ ఫ్లోర్‌లీడర్ కె.రామకృష్ణారెడ్డి స్వామి వారిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ నాయకులు గుట్టమీది నరేందర్, భిక్షపతి వారిని సత్కరించారు. భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చి బీరప్పను దర్శించుకున్నారు.



బీరప్ప కల్యాణం నిర్వహిస్తున్న ఒగ్గు కళాకారులు



ఒగ్గుకథ వింటున్న భక్తులు



గంపలతో ఊరేగింపుగా ఆలయానికి వెళ్తున్న గ్రామస్తులు